# సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

**ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**



అంకాపూర్‌లో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆర్మూర్, అక్టోబర్16: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మవద్దని ప్రజలకు తెలపాలని సూచించారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రజలకు ఏకష్టం వచ్చినా అక్కున చెరుకునే జీవన్‌రెడ్డిని మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి రజితారెడ్డి, ఆర్మూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నందిపేట మండల అధ్యక్షుడు సాగర్, నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి వేముల హయాంలోనే అభివృద్ధి

బాల్కొండ, అక్టోబర్ 16: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హయాంలో చరిత్రలోనే నిలిచిపోయేలా నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ లావణ్యా లింగాగౌడ్, జడ్పీటీసీ లావణ్యా వెంకటేశ్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, నాగులపల్లి రాజేశ్వర్, తౌటు గంగాధర్, పుప్పాల విద్యాసాగర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో అన్ని వర్గాలకూ లబ్ధి..

భీమ్‌గల్, అక్టోబర్ 16: సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిచేకూర్చేలా ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్, ఎంపీపీ మహేశ్, జడ్పీటీసీ రవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్‌తోకలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఇతర పార్టీల నాయకులకు ఏం చేయాలో తోచడం లేదన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ భగత్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు శర్మనాయక్ తదితరలు పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

ఏర్గట్ల, అక్టోబర్ 16: రాష్ట్రంలోని సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రకటించారని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు అందరూ సైనికుల్లా పని చేయాలని అన్నారు. సమావేశంలో రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు లింగారెడ్డి, బీఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు కొలిప్యాక శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు భీమనాతి భానుప్రసాద్, కుండ నవీన్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మలేషియా పరిశోధక కార్యక్రమానికి ఎంపిక



మాడవేడి సుధాకర్

ఆర్మూర్, అక్టోబర్16: ఆర్మూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాడవేడి సుధాకర్ మలేషియాలోని ఐఎన్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సందర్శక పరిశోధక కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈనెల 29 నుంచి నవంబర్ 7 వరకు మలేషియాలోని ఐఎన్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో పర్యటించనున్నారు. అక్కడ జరిగే వివిధ సంక్షిప్త పరిశోధన కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. భారత్‌లో డిజిటల్ పేమెంట్లలో ప్రపంచంలోనే ముందున్న తీరు, కరోన నియంత్రణలో భారత్ అవలంబించిన పద్ధతులు, వ్యాక్సిన్‌ను ప్రపంచదేశాలకు అందించిన విధానం, రెండు దశాబ్దాల్లో రిటైల్ రంగంలో వస్తున్న మార్పులు, ఇమిడి ఉన్న మెనేజ్‌మెంట్ సబ్జెక్టు అంశాలపై అక్కడి మేనేజ్‌మెంట్ పరిశోధన విద్యార్థులకు సుధాకర్ వివరించనున్నారు.

## బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యాంరావు

బోధన్, అక్టోబర్ 16:బోధన్ ఐదో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితుడైన జి.శ్యాంరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్‌లోని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. శ్యాంరావు బోధన్ కోర్టుకు మూడేళ్ల పాటు ఏపీపీగా విధులు నిర్వహిస్తారు. శ్యాంరావుకు బాధ్యతలు అప్పగించిన అనంతరం లక్ష్మీ నర్సయ్య అభినందనలు తెలిపారు. శ్యాంరావుకు బోధన్ న్యాయస్థానానికి చెందిన పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

## యంచ వద్ద చెక్ పోస్టు ప్రారంభం



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్

నవీపేట, అక్టోబర్16: మండలంలోని యంచ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మహారాష్ట్ర నుంచి మద్యం, డబ్బు రవాణాను అడ్డుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యంచ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా మద్య, డబ్బు తరలిస్తే స్వాధీనం సీజ్ చేసి అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏసీపీ వెంట నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ ఏఎస్సై గఫార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## 2వ వార్డులో మహిళా సమాఖ్య సమావేశం



మాట్లాడుతున్న కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత

ఆర్మూర్, అక్టోబర్16: పట్టణంలోని 2వ వార్డులో మహిళా సమాఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మహిళా సంఘానికి రూ. 10లక్షలు నిధులు మంజూరు చేయడంతో మహిళా సంఘ భవనం నిర్మించుకున్నట్లు తెలిపారు. నూతన భవనంలో సమావేశం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కౌన్సిలర్ సంగీత, మహిళా సంఘం సభ్యులు జీవన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాందేశ్ సత్యం, సాయి, ప్రశాంత్, ఆర్‌వీ మమత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టి వేత

బోధన్ రూరల్, అక్టోబర్ 16: మంజీర నది నుంచి ఇసుక తరలిస్తున్న ముడు ట్రాక్టర్లను రాంపూర్ శివారులో ఆదివారం రాత్రి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ సోమవారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించవద్దని ఎస్సై అన్నారు.

## 'షకీల్‌ను ముడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకొంటాం'



సాటాపూర్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు, కార్యకర్తలు

రెంజల్, అక్టోబర్ 16: బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ షకీల్‌ను ముడోసారి భారీ మెజార్టీతో గెలిపించుకొంటామని సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, సర్పంచ్ వికార్‌పాషా అన్నారు. ఎమ్మెల్యే షకీల్‌కు బీఫారం అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం సాటాపూర్‌లోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సంబురాలను నిర్వహించారు. సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

**మ్యాఫెస్టోపై కళాకారుల ఆటపాట**

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార వాహనం సాటాపూర్ గ్రామానికి చేరుకుంది. బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ తరపున బీఆర్ఎస్ ప్రకటించిన ప్రకటించిన మ్యాఫెస్టోపై కళాకారుల ఆట, పాటల ద్వారా వివరించారు.

## సోయా పంట కోతలు షురూ..



యంత్రం సాయంతో పంట నూర్పిడి చేస్తున్న కూలీలు

రెంజల్, అక్టోబర్ 16: మండలంలో సోయా పంట కోతలు మొదలయ్యాయి. మండలంలోని కందకుర్తి, బోర్గాం, నీలా గ్రామాల్లో సోయా పంటను రైతన్నలు సాగుచేశారు. గతేడాదితో పోలిస్తే ఈఏడాది సుమారు వెయ్యి ఎకరాల మేరకు అధికంగా సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. కాలం కలిసి రావడంతో పంట దిగుబడి పెరిగిందని రైతులు అంటున్నారు. రాజస్థాన్ వలస కూలీలు పంట చేనులో నూర్పిడి యంత్రాల వద్ద పనిచేస్తూ వచ్చే కూలీతో ఉపాధి పొందుతున్నారు. రోజుకు 10 ఎకరాల మేరకు సోయా పంట నూర్పిడి చేస్తున్నారు.

## శక్కర్‌నగర్‌లో వ్యక్తి ఆత్మహత్య

శక్కర్‌నగర్, అక్టోబర్ 16: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లో జి.స్వామి (43) అనే వ్యక్తి తన సొంత ఇంట్లో ఉరేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లేకపోవడంతో కొన్నేళ్లుగా ఒంటరిగా ఉంటున్న ఆయన, హైదరాబాద్‌లోనే ఉండేవాడని, ఇటీవల శక్కర్‌నగర్‌కు వచ్చి ఉంటున్నట్లు కాలనీవాసులు తెలిపారు. రాత్రి ఇంట్లో ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలియడం లేదు. పోలీసులు శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## లక్ష గాజులతో అమ్మవారికి అలంకరణ



చౌడమ్మ ఆలయంలో దుర్గామాతకు లక్ష గాజులతో అలంకరణ ..

నందిపేట్, అక్టోబర్ 16: చౌడమ్మ కొండూర్ గ్రామంలోని చౌడమ్మ ఆలయంలో దుర్గానవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. దుర్గానవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చౌడమ్మ ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించనున్న పూజల్లో భాగంగా లక్ష గాజులతో సోమవారం సాయంత్రం అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి విగ్రహాన్ని మధ్యలో ఉంచి చుట్టూ లక్ష గాజులను పేర్చారు. మూడో రోజు మంగళవారం చంద్రగంట దేవి ఆకారంలో అమ్మవారు పూజలందుకుంటారని, లక్ష గౌరమ్మలు, లక్ష గాజులు, లక్ష వస్త్రాలతో పూజలు నిర్వహిస్తాని సర్పంచ్ ప్రభాకర్, ఉత్సవాల నిర్వాహకులు కోరారు. సాయంత్రం 4గంటల నుంచి సౌభాగ్య లక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**దుర్గామాత మండపం వద్ద అన్నదానం.**

ఎడపల్లి, అక్టోబర్ 16: ఏఆర్‌పీ గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా రెండో రోజు దుర్గామాత మండపం వద్ద విలేజ్ కమిటీ, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

**పోచంపాడ్ గ్రామంలో..**

మెండోరా, అక్టోబర్ 16: పోచంపాడ్ గ్రామంలో దుర్గామాత మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు మండపం వద్ద అన్నదానం కొనసాగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.